క్లుప్తంగా

వైద్య సిబ్బందికి క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సూపరింటెండెంట్

గూడూరు: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఏరియా ఆస్పత్రిలోని మహిళా వైద్యులు, నర్సులు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం క్రీడా పోటీలను నిర్వహించారు. అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో పోటీలు జరిగాయి. విజేతలకు ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయ, సంస్థ సభ్యులు కరీముల్లా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

50 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

చిల్లకూరు: వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా ఏరూరు సచివాలయంలో చింతవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బుధవారం 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 36 మందికి అద్దాలు అవసరమని గుర్తించారు. త్వరలో వారికి అద్దాలు పంపిణీ చేస్తామని కంటి వైద్య నిపుణుడు జీవీవీ రమణయ్య తెలిపారు.

ఘనంగా రథోత్సవం



రథోత్సవంలో వేణుగోపాల స్వామి

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని మంగళంపాడు గ్రామంలో సౌందర్యవల్లీ రుక్మిణీ సత్యభామా గోదాసమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఘనంగా స్వామి వారి రథోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు రథోత్సవంలో పాల్గొని తేరును లాగారు. సాయంత్రం ఆలయంలో జలద్రోణీస్నానం నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై వేణుగోపాల స్వామి ఊరేగారు.

ఎన్‌బీకేఆర్‌లో శిక్షణ తరగతులు

కోట: ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో జపాన్‌కు చెందిన మెడిన్‌షా కార్పొరేషన్ సంస్థ విద్యార్థులకు బుధవారం శిక్షణ తరగతులు ప్రారంభించింది. సంస్థ ఎండీ యమమోటో, అడ్వైజర్ కజుమి ఇకరాషి హాజరయ్యారు. ఎలక్ట్రికల్ విభాగం నుంచి 50 మంది, మెకానికల్ నుంచి 25 మంది విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత

- గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



దేవసేనమ్మకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ తదితరులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. వారి పేరుపైనే అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాటక అకాడమీ డైరెక్టర్ వై.మంజుల, పార్టీ నాయకులు బత్తిని విజయ్‌కుమార్, శ్రీనివాసులు, రమీజా, నరసయ్య, అజీజ్, సుబ్బమ్మ, లక్ష్మి, జీనత్ పాల్గొన్నారు.

మహిళలే కుటుంబానికి బలం

గూడూరు: మహిళలే కుటుంబానికి బలమని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కేవీ నాగజ్యోతి అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ షేక్ రియాజ్ అహ్మద్ 40 మంది పేద మహిళలకు చీరలు, అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, ఫ్యాన్ అందజేశారు. క్లబ్ సభ్యులు రాధాకృష్ణ, శీనయ్యల దాతృత్వంతో రెండు కుట్టు మిషన్లను అందజేశారు. రామ్మోహన్‌రావు, క్లబ్ సభ్యులు రూపేష్‌రెడ్డి, చెంచురామయ్య, రమణయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందున్నారు

గూడూరు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో పురుషులకు ధీటుగా మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్విన్ సుల్తానా బేగం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, రామసుబ్బయ్య, ఉమాశంకర్ పాల్గొన్నారు.

మహిళా అధికారులకు సన్మానం

గూడూరు: స్త్రీ ఎక్కడ గౌరవించబడుతుందో అక్కడ సమాజం సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉంటుందని ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని మహిళా అధికారులను సన్మానించారు. వారికి చీరలు, స్వీట్ బాక్సులను అందజేశారు.

స్వశక్తితో విజయాలు సాధించాలి

చిల్లకూరు: మహిళలు స్వశక్తితో విజయాలు సాధించాలని కృష్ణపట్నం అదానీ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. మండలంలోని లింగవరం సచివాలయం పరిధిలో మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ హెడ్ రాకేష్‌రంజన్ అనుషా, రమేష్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోట: ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో అధ్యాపకులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ తనూజ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ ఇందుమతి పాల్గొన్నారు.

బహుమతుల పంపిణీ

వాకాడు: మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయ ఆవరణల్లో ఉత్తమ సేవా భావం కలిగిన మహిళలను ఘనంగా సన్మానించారు. ఏపీఎం వెంకటరావు పొదుపు మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.



చిల్లకూరు: ర్యాలీ నిర్వహిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు



ఎన్‌బీకేఆర్‌లో..



వాకాడులో..



గూడూరు: మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న దాతలు



మాట్లాడుతున్న న్యాయమూర్తి



మహిళా అధికారులను సత్కరిస్తున్న ఆర్డీఓ

సంక్షేమానికి పట్టం కట్టండి



ఎన్నికల ప్రచారంలో బల్లి కల్యాణ్ చక్రవర్తి



కోట: ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

–ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్

గూడూరు: సంక్షేమ పథకాలతో సుభిక్ష పాలన అందజేస్తున్న సీఎం జగనన్న బలపరిచిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డిలకు ఓట్లేసి గెలిపించాలని ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి కోరారు. పట్టణంలోని శాంతినగర్‌లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దాసరి వెంకటేశ్వర్లు, రాఘవరెడ్డి, మనోజ్, సుబ్బయ్య, ధనమ్మ పాల్గొన్నారు.

పేర్నాటి, పర్వతరెడ్డిలను గెలిపించండి

వెంకటగిరి: ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర కోరారు. విద్యారంగంలో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులను పట్టభద్రులు, ఉపాధ్యాయులు గమనించి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు.

శ్యాంప్రసాద్‌రెడ్డి గెలుపే లక్ష్యం

కోట: మండలంలోని వెంకన్నపాళెం, వీరారెడ్డిసత్రంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యులు మొబీన్‌బాషా, రాజేశ్వరి, నాయకులు శ్రీనివాసులు, శ్రీహరి పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి



ఓజిలి పోలీస్ స్టేషన్‌లో చెట్లు నాటుతున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

ఓజిలి: వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మహిళాదినోత్సవం సందర్భంగా ఓజిలి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం దిశచట్టాన్ని తీసుకొచ్చి వారి రక్షణకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఓజిలి వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా పొదుపు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ దారం ఆదిలక్ష్మి, మహిళ పోలీసులు, ఏపీఎం నిర్మలమ్మ, సీసీ శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య, వీఓఏలు పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం



గ్రామంలో నిర్మించిన నూతన వినాయక ఆలయం

ఓజిలి: మండల పరిధిలోని కురుగొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవరసిద్ధి వినాయక ఆలయం కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు నాలుగు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనము, రక్షాబంధము, అంకురార్పణ నిర్వహించారు. గురువారం ఉదయం యాగశాల ప్రవేశము, కలశస్థాపనము గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



మాట్లాడుతున్న చైర్మన్ వెంకట నారాయణ తదితరులు

నాయుడుపేటటౌన్: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి విజయం చేకూర్చేలా సంఘ నాయకులందరూ పనిచేయాలని ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొర్నా వెంకట నారాయణ ముదిరాజ్ కోరారు. పట్టణంలోని ముదిరాజ్ సంఘ కార్యాలయం ఆ సంఘం నాయకులు గునిశెట్టి గోపాల్ అధ్యక్షతన బుధవారం డివిజన్ పరిధిలోని ముదిరాజ్ సంఘ నాయకులతో జరిగిన సమావేశంలో వెంకట నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీరామ్‌గురుస్వామి, సంఘ నాయకులు గొనుపల్లి చంద్రశేఖర్, పూజారి శ్రీరాములు, గరిక సుబ్రహ్మణ్యం, యూ ప్రసాద్, వి. రఘురామయ్య, ముమ్మడి శ్రీనివాసులు, లీలా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పెళ్లకూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి కోరారు. బుధవారం దిరసనమాల, కప్పగుంటకండ్రిగ గ్రామాల్లో పర్యటించి ఉపాధ్యాయ, పట్టభద్రులను కలిసి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఓటు వేయలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాయుడు, సతీష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మండల పరిధిలోని మానమాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి ముమ్మరంగా ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపునకు పార్టీ నాయకులు కష్టపడి పనిచేయాలని సూచించారు.

సీఎం వైఎస్ జగన్‌తో మగువల అభ్యున్నతి

- నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



వెంకటగిరి: మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

వెంకటగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించి వారి అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక బాలసదన్‌లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, 30 లక్షల ఇళ్ల పట్టాలను అక్క చెల్లెమ్మల పేర్లతోనే ఇచ్చారని తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో వారికే ప్రాధన్యత ఇచ్చారని, స్థానిక సంస్థల్లో 50 శాతం సీట్లు మహిళలకే కేటాయించినట్లు చెప్పారు. మహిళల భద్రత కోసం దిశ యాప్, పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశారన్నారు. అనంతరం బాలసదన్ చిన్నారులు, మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేశారు. చిన్నారులకు విద్యాసామగ్రి అందజేశారు. బాలసదన్‌ను తన సొంత నిధులతో మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటానని రాంకుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ సీహెచ్ ఉమామహేశ్వరి, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, డక్కిలి జెట్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి, ధనియాలరాధమ్మ, కౌన్సిలర్లు సుకన్య, వహిదా, మల్లీశ్వరి, సుభావళి తదితరులు పాల్గొన్నారు.

రాపూరు: మండల కేంద్రంలో పొదుపు సంఘం సభ్యులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఏపీఎం కృష్ణయ్య బహుమతులు అందజేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం

వెంకటగిరి: మహిళల్లో చైతన్యం ఉన్నప్పుడే సమాజం బాగుంటుందని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి అనూష అన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మహిళా, బాలల చట్టాలు, హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. న్యాయవృత్తి కన్నా విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయవృత్తి గొప్పదన్నారు. రేణుకాదేవి, సునీత పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో..

మెప్మా సీఓ వెంకటేశ్వర్లు, దుర్గేష్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద వేడుకలు జరిగాయి. మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.



రాపూరులో విజేతలకు బహుమతుల ప్రదానం



జూనియర్ సివిల్ జడ్జి అనూషను సన్మానిస్తున్న ఎస్టీయూ మహిళలు



పొదుపు మహిళలకు బహుమతులు అందజేస్తున్న మెప్మా సిబ్బంది

జగనన్న పాలనలో మహిళలకు అగ్రస్థానం



సూళ్లూరుపేట మున్సిపాలిటీల్లో అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్న మహిళలను సత్కరించిన ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలకు అగ్రస్థానం ఇచ్చి, మహిళాభివృద్ధికి పాటుపడుతున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం పలు మండలాలకు చెందిన మహిళ ప్రజా ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే శాలువలు కప్పి, పూలమాలలతో సత్కరించి వారికి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కట్టా సురేఖ రెడ్డి, నాయుడుపేట, ఓజిలి ఎంపీపీలు కురుగొండ ధనలక్ష్మి, గడ్డం అరుణారెడ్డి, వైస్ ఎంపీపీలు నెలవల సుమతి, అత్తికాయల కృష్ణవేణి, పార్టీ మహిళ ప్రధాన కార్యదర్శి ఈదా రత్నశ్రీ, మహిళ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మహిళా సాధికారత

సూళ్లూరుపేట : జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత మహిళా సాధికారతకు పెద్దపీట వేసి, అన్ని రంగాల్లో మహిళలకు ఎనలేని ప్రాధ్యానతను కల్పించారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరు పద్మా మిల్టన్, ఇతర మహిళా కౌన్సిలర్లు అందరూ కలిసి భారీ కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే అందరికీ తినిపించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. మహిళా బ్యాంక్ మేనేజర్లు, సిబ్బంది, మున్సిపాలిటీలో విశిష్ట సేవలు అందించిన మహిళా ఉద్యోగులకు, మెప్మా శాఖలో విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులకు, ఆర్‌పీలు, మహిళా కౌన్సిల్ సభ్యులు, మహిళా ప్రజాప్రతినిధులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



పెళ్లకూరులో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు



మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

తడలో

తడ: మండలంలోని నడిమి కుప్పం ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చెల్లాతమ్మ సేవా సమితి వారు పిల్లల మధ్యాహ్న భోజన తయారీకి అవసరమైన వంట పాత్రలు అందించారు. సేవా సమితి అధ్యక్షురాలు సునీత, భోజన నిర్వాహకురాలు రోజమ్మ, మరుగు దొడ్లు శుభ్ర పరిచే ఆయమ్మ రేఖను సన్మానించారు. కార్యక్రమంలో జేవీవీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు చెంగయ్య, పాఠశాల హెచ్ఎం సుధాకర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలి

పెళ్లకూరు: వివిధ రంగాల్లో దేశం అత్యున్నతస్థాయికి ఎదగాలంటే మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం మునిరాజయ్య అన్నారు. మండల పరిషత్, వెలుగు, ఐసీడీఎస్, పోలీస్‌స్టేషన్, పీహెచ్‌సీ తదితర కార్యాలయాల్లో బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అనంతరం మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు సిద్ధమ్మ, కార్యదర్శి పావని, బ్యాంక్ మేనేజర్ వివేక్, శ్రీధర్, ప్రభాకర్‌రావు, సీసీలు, వీవోఏలు పొదుపు మహిళలు పాల్గొన్నారు.



మహిళ ప్రజాప్రతినిధులకు శాలువలు కప్పి సత్కరించిన ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు

తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం

ఏర్పేడు: వ్యవసాయ సాగులో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని పెంచుకోవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దివ్య అన్నారు. బుధవారం మండలంలోని పాపానాయుడుపేట రాస్ మహిళాభారతి కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో డ్రమ్‌సీడర్ విధానంతో తక్కువ ఖర్చు, కూలీలు, నీటి ఆదా చేసుకోవచ్చని సూచించారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకంతో భూసారం తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారాన్ని పెంచుకోవచ్చన్నారు. భారతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఆధునిక పద్ధతుల్లో సాగుపై 25 రోజుల పాటు శిక్షణ జరుగుతుందన్నారు. పుట్టగొడుగులు, పెరటి కోళ్ల పెంపకం, సేంద్రియ విధానంలో కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. రైతులు ఒకే పంట కాకుండా పంట మార్పిడి చేయాలన్నారు. కార్యక్రమంలో రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి, సిబ్బంది పార్థసారథి, గిరిప్రసాద్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

పూతలపట్టు: మండలంలో రంగంపేట క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం ఓ కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల మేరకు బెంగళూరుకు చెందిన దిలీప్ బుధవారం తిరుపతికి కారులో బయలుదేరాడు. మార్గమధ్యంలోని రంగంపేట క్రాస్ వద్ద ఆ కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. దీంతో దిలీప్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. దీనిపై వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆలయ శిఖర ప్రతిష్ట మహోత్సవం



స్వామివారి కల్యాణోత్సవానిన తిలకిస్తున్న భక్తులు

చిల్లకూరు: బల్లవోలు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి, జనార్దనస్వామి ఆలయంలో బుధవారం ధ్వజ స్తంభ ఏర్పాటు, ఆలయ శిఖర ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ధ్వజస్తంబానికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కలశాలను ఆలయ శిఖరంపై ప్రతిష్టించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నెల్లూరుకు చెందిన మారంరెడ్డి రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మారంరెడ్డి అమరనాథ్‌రెడ్డి, దువ్వూరు కిరణ్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఉభకర్తలుగా వ్యవహరించారు.

నిరుపయోగం..టూరిజం



దీవీ సత్రంలో ఏపీ టూరిజం హోటల్ సముదాయం



నిరుపయోగంగా మారిన టూరిజం హోటల్

దొరవారిసత్రం: మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన టూరిజం శాఖ హోటల్ భవనాన్ని సుమారు 20ఏళ్ల క్రితం చేపట్టింది. అప్పట్లోనే కోటి రూపాయల అంచనాతో భారీ ప్రణాళికతో షాపింగ్ కాంప్లెక్స్ సముదాయం నిర్మించారు. ఆరంభంలో మాత్రం సుమారు ఏడాది పాటు టూరిజం శాఖ ఆధ్వర్యంలో నడిచింది. ఆ తరువాత కొన్నేళ్లు మూతబడింది. మళ్లీ కొందరికి కాంట్రాక్ట్‌కు ఇచ్చి హోటల్‌ను నడిపారు. వీటిపై పర్యవేక్షణ కొరవడంతో ఎవరూ పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో సుమారు పదేళ్లనుంచి ఈ భవనం తెరుచుకోలేదు. ఐదేళ్ల క్రితం వరకూ తరచూ శుభకార్యాలు వంటివి టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆ హోటల్లో కనీసం నీరు, విద్యుత్ సౌకర్యం వంటివి లేకపోవడంతో నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటోంది.